సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 20 । మార్చి । 2023



లేపాక్షికి పునర్వైభవం
చాలాఏళ్ల క్రితం లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ధ్వంసమైన అరుదైన శిల్పాలను, తైలవర్ణ చిత్రాలను అధికారులు పునరుద్ధరిస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.12
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 పలికింది. మార్కెట్‌కు 225 టన్నుల కాయలు వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/19.7°

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రత తగ్గిపోగా.. రాత్రి ఉ:ష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఉపరితల ఆవర్తనంతో అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'
పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బసంత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలోనూ 'పోలీస్ స్పందన' ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.

దరఖాస్తుల పరిశీలన
అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో బోధన పోస్టులు భర్తీ చేస్తున్నారు. 2018లో ఏర్పడిన ఈ యూనివర్సిటీలో బోధన ,బోధనేతర ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. తాజాగా మార్పు చేర్పులతో బోధన పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్‌ను గత నెల 23న విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన గడువు ఈ నెల 15న ముగిసింది. దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కమిటీలు నియమించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అనంతరం పోస్టుల భర్తీ ప్రక్రియ షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

నేడు 'పోషణ్ పక్వాడా'పై 2కే ర్యాలీ
పుట్టపర్తి అర్బన్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ్ పక్వాడా పక్షోత్సవ కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలో 2కే ర్యాలీ ఉంటుందని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ సర్కిల్‌లో ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ బసంత్ కుమార్ ప్రారంభిస్తారన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వర్షాలతో పంటలకు నష్టం



పెనుకొండ మండలం మునిమడుగులో నేల రాలిన మామిడికాయలు చూపుతున్న మహిళ

అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వానలు పడ్డాయి. అకాల వర్షాలకు పలు మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అమడగూరు మండలంలో 22 హెక్టార్లలో, నల్లచెరువు మండలంలో 8 హెక్టార్లలో, తనకల్లు-23, బుక్కపట్నం-2, ధర్మవరం-16, కొత్తచెరువు-91, బత్తలపల్లి-1, పెనుకొండ-116, రొద్దం-16, కదిరి-93, తలుపుల-15, ఎన్‌పీకుంట-1, గాండ్లపెంట-3, ముదిగుబ్బ-8 హెక్టార్ల మేర పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా మొక్కజొన్న 349 హెక్టార్లలో దెబ్బతినగా, కొబ్బరి 41 హెక్టార్లు, ప్రొద్దుతిరుగుడు 25 హెక్టార్ల మేర పంట నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేశారు.

మామిడికి బీమా సౌకర్యం కల్పించాలి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: మామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. ఆదివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడ్డాయన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా చెరువులు నింపడంతో నీరు పుష్కలంగా ఉందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ప్రోత్సాహంతో శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యాన తోటల విస్తీర్ణం పెరిగిందన్నారు. ఇందులో మామిడి అత్యధిక విస్తీర్ణంలో సాగులోకి వచ్చిందన్నారు. అయితే, ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర లేక ఏటా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఉద్యాన తోటలకు కూడా బీమా వర్తింపజేస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పుట్టపర్తి సమీపంలో డాక్టర్ వైఎస్సార్ ఫార్మర్ నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోరారు.

ఉజ్వల భవితకు దీవెన

- జిల్లాలో 36,391 మంది విద్యార్థులకు లబ్ధి
- సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విద్యాదీవెన' పథకం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత ఫీజు మొత్తాన్ని అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కును కలెక్టర్ బసంత్‌కుమార్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేయడం గొప్ప విషయమన్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదని సాయం అందజేస్తున్నారన్నారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.20 వేల చొప్పున విడుదలైందన్నారు. పారదర్శకంగా నగదును తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. జిల్లాలో పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 36,391 మంది విద్యార్థులకు సంబంధించి రూ.22.85 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో పడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఎస్టీ కార్పొరేషన్ అధికారి మోహన్‌రావు, బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

చాలా సంతోషంగా ఉంది


పీఐఎంఎస్ కళాశాలలో డెంటల్ కోర్సు చదువుతున్నా. నిరుపేద కుటుంబాల విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం అండగా నిలుస్తోంది. మా తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారు. సీఎం వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– యాస్మిన్, కర్ణాటకనాగేపల్లి, పుట్టపర్తి

బాగా చదువుతున్నాం


ప్రభుత్వ బాసటతో బాగా చదువుతున్నాం. మమ్మల్ని ఆదర్శంగా తీసుకొని మరికొంత మంది విద్యార్థులు చదువుల బాట పడతారు. ఇదేగాక మరిన్ని పథకాలతో ముఖ్యమంత్రి జగనన్న మా కుటుంబానికి అండగా ఉంటున్నారు.

– ప్రసాద్, బుక్కపట్నం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు


బుక్కపట్నంలో టీచర్ ట్రెనింగ్ కోర్సు చేస్తున్నా. ప్రతి విద్యార్థికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. పేద పిల్లలు సైతం ఉన్నత విద్య అభ్యసించడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది.

– ఇందిర, పుట్టపర్తి

జిల్లాకు చేరిన పదో తరగతి పరీక్షల సామగ్రి



సామగ్రిని వాహనంలో నుంచి దించి స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న సిబ్బంది

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలతో పాటు ఓఎంఆర్ షీట్లు, పరీక్షల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ ఆదివారం కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరింది. డీఆర్‌ఓ కొండయ్య, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి సామగ్రిని స్వాధీనం చేసుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం వద్ద సాయుధ బలగాలతో భద్రత ఏర్పాటు చేశామన్నారు. వచ్చే నెల 18 వరకూ కొనసాగుతుందన్నారు. సోమవారం నుంచి సామగ్రిని మండలాలకు తరలించనున్నట్లు చెప్పారు. అక్కడి నుంచి పరీక్షలు జరిగే రోజు ఉదయం 8.30 గంటలకు కేంద్రాలకు చేర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏడీ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే వాహనం సీజ్!

- వాహన తనిఖీల్లో రవాణా శాఖ అధికారుల జోరు
- జరిమానా, పన్ను వసూళ్లలో వేగం
- కట్టకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి, పుట్టపర్తి: నూతన జిల్లా ఏర్పడిన నాటి నుంచి రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో వాహన జరిమానాలు 94 శాతం మేర వసూలు చేశారు. రూ.10 కోట్ల వసూలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకూ రూ.9.17 కోట్లు రాబట్టారు. అదే విధంగా ఫిక్స్‌డ్ ట్యాక్స్ రూ.41.45 కోట్లు ఉండగా అందులో రూ.21.40 కోట్లు వసూలు చేసి ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం తీసుకొచ్చారు.

పటిష్ట నిఘా

జిల్లాలో చాలా ప్రాంతాలు కర్ణాటక సరిహద్దులో ఉండటంతో వాహనాల తనిఖీ అధికారులు విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ల వాహనాలు కనిపించిన వెంటనే పరిమితులను (పర్మిట్) పరిశీలించి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రాష్ట్రంలో ప్రవేశిస్తే జరిమానా వసూలు చేస్తున్నారు.

2.77 లక్షల వాహనాలు..

జిల్లావ్యాప్తంగా మొత్తం 2,77,235 వాహనాలు ఉన్నాయి. అందులో అత్యధికం మోటారు బైక్‌లు 2,01,238 కాగా, ఆటో రిక్షాలు 15 వేలు, కార్లు 13 వేలు, గూడ్స్ వెహికల్స్ 11 వేలు, ట్రాక్టర్లు 11 వేలు, ట్రాలీలు, జీపులు, క్యాబ్‌లు, విద్యాసంస్థల వాహనాలు, డంపర్లు, అంబులెన్సులు, ఓమ్ని బస్సులు, చెట్ల కోత వాహనాలు కలిపి మొత్తం 2.77 లక్షలు ఉన్నాయి.

3,600 నాన్ పేమెంట్ వెహికల్స్

మొత్తం వాహనాల్లో పన్ను చెల్లించనివి 3,600 ఉన్నాయి. యజమానులు సకాలంలో పన్ను చెల్లించకుంటే తనిఖీల్లో పట్టుబడినప్పుడు వాహనం సీజ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని, తర్వాత ఎక్కడైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

సకాలంలో లక్ష్యం పూర్తి చేస్తాం


పన్ను వసూళ్లలో మా సిబ్బంది చురుగ్గా పని చేస్తున్నారు. ఇప్పటికే సగం పైగా ఫిక్స్‌డ్ ట్యాక్స్ వసూలు చేశాం. జరిమానాల టార్గెట్‌లో 94 శాతం పూర్తయింది. మిగతా సొమ్ము కూడా సకాలంలో వసూలవుతుంది.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రోడ్డు రవాణా అధికారి

'రిజిస్ట్రేషన్'లో ఇక డిజిటల్ సేవలు!

- కార్యాలయాల్లో రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 14 కార్యాలయాలు డిజిటల్
- ఏప్రిల్ నుంచి అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏప్రిల్ నుంచి డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇదివరకు భూముల రికార్డుల వివరాలు కావాలంటే రోజులు తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఇకపై అంత సమయం వేచి ఉండక్కర్లేదు. రిజిస్ట్రేషన్ సేవలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రికార్డుల డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే వినియోగదారులు ఏ రికార్డు కావాలో ఆ రికార్డు కోసం ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే గంటల వ్యవధిలోనే పొందే అవకాశం ఉంటుంది.

14 కార్యాలయాల్లో డిజిటలైజేషన్ పూర్తి

ఉమ్మడి అనంతపురంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల కింద 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 14 కార్యాలయాల్లో రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుంటే.. వీటిలో ఇప్పటికే తొమ్మిది కార్యాలయాల్లో డిజిటలైజేషన్ పూర్తయ్యింది. శ్రీ సత్యసాయి జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఐదింటిలో డిజిటలైజేషన్ పూర్తి చేశారు. మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్చి ఆఖరులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రామ్‌నగర్ కార్యాలయంలో 100 శాతం పూర్తి

జిల్లా రిజిస్ట్రార్ ప్రధాన కార్యాలయం ఉన్న అనంతపురం రామ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డుల (మ్యానువల్ ఈసీ, ఆర్‌హెచ్ పేజీ, డాక్యుమెంట్ నకల్ కాపీలు) డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికే 100 శాతం పూర్తి చేశారు. వీటితోపాటు ప్రస్తుతం వేలిముద్రల డిజిటల్ ప్రక్రియ చేపడుతున్నారు. నెలాఖరులోపు వేలిముద్రల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

వచ్చే నెలలో అందుబాటులోకి..


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా చేపడుతున్నాం. 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని 25 వేలకుపైగా వాల్యూమ్స్‌ను డిజిటల్ చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే.. వచ్చే నెలలో దశల వారీగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నాం.

– మాధవి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, డీఐజీ

అన్నదాతల చెంతనే ఎరువులు

- రబీలో 12,109 టన్నుల ఎరువుల వినియోగం
- నమోదు చేసుకున్న వెంటనే అందుబాటులోకి
- అన్నదాతలకు తప్పిన వ్యయప్రయాసలు

పుట్టపర్తి అర్బన్: ఎరువుల కోసం రైతన్నలు ఎక్కడా ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆర్‌బీకేలలో నమోదు చేసుకున్న వెంటనే అందుబాటులోకి తెచ్చింది. ఈ రబీ సీజన్‌లో దాదాపు 12,109 టన్నుల ఎరువులను రైతులకు అందజేసింది. రైతు భరోసా కేంద్రాలతో పాటు వ్యవసాయ సహకార సంఘాలకు డీఏపీ, ఎంఓపీ, యూరియా, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ, నానోయూరియా తదితర 6 రకాల ఎరువులు సరఫరా చేసింది. యూరియా రూ.266.5, ఎంఓపీ రూ.1,663, డీఏపీ రూ.1,350, కాంప్లెక్స్ రూ.1,350, రూ.1,400, రూ.1,470 (మూడు రకాలు) ధరలతో అమ్మకాలు సాగించారు. తక్కువ ధరలకే అందుబాటులోకి రావడంతో రైతులు ఉత్సాహంగా కొనుగోలు చేశారు.

గతంలో నిలువు దోపిడీ..

ఆర్‌బీకేలు లేకముందు బయట మార్కెట్‌లో ఎరువులు, పురుగు మందులు కొనాల్సి వచ్చేది. పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్ట పోయేవారు. కొన్నాక వాటిని గ్రామాలకు తరలించాలంటే రోజంతా గడిచిపోయేది. ఉన్న ఊరిలోనే రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలు సమకూర్చడంతో నేడు వ్యయప్రయాసలు పూర్తిగా తగ్గాయి.



బుక్కపట్నం ఆర్‌బీకేలో ఎరువులు పంపిణీ చేస్తున్న జిల్లా మేనేజర్ గీతమ్మ (ఫైల్)

సకలం.. పల్లెముంగిట్లోనే..

వ్యవసాయాన్ని పండగ చేయడమే లక్ష్యంగా అన్నదాతకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది. సాగులో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడానికి ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయశాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. విత్తనాల అమ్మకంతో పాటు పంట ఉత్పత్తుల కొనుగోలు చేపడుతోంది. పంట నష్టపోతే వెంటనే సిబ్బంది వెళ్లి వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి తెలియజేయడం వంటి పనులు సకాలంలో చేపడుతున్నారు. దీంతో పాటు రైతు భరోసా పథకంలో ఏ సమయంలో ఎంత మొత్తం అందజేస్తున్నారనే వివరాలు తెలియజేస్తున్నారు. ఇటీవల ఒక్కో రైతు భరోసా కేంద్రంలో 5 మందితో గ్రూపులను ఏర్పాటు చేసి సబ్సిడీపై ట్రాక్టర్, ఇతర పనిముట్లు అందజేస్తున్నారు.

రబీ సీజన్ ఎరువుల వివరాలిలా..

416
జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలు

9,280 టన్నులు
సరఫరా అయిన ఎరువులు

2,829 టన్నులు
సహకార సంఘాల ద్వారా..

నమోదు చేసుకున్న వెంటనే అందిస్తున్నారు


పంటలకు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేయడం చాలా సంతోషంగా ఉంది. గతంలో మండల కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేసి తరలించాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. రోజంతా సమయం గడిచి పోయేది. ఇప్పుడు నమోదు చేసిన వెంటనే ఊర్లోనే అందజేస్తున్నారు.

– రాజశేఖరరెడ్డి, దిగువ చెర్లోపల్లి

బయట కొని నష్టపోవొద్దు


రైతు భరోసా కేంద్రాల్లోని డీబీటీ, కియోస్కులలో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, విత్తనాలు నమోదు చేసిన వెంటనే సరఫరా చేస్తాం. ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నీ అందుబాటులో ఉంటాయి. బయట మార్కెట్లకు వెళ్లి నష్టపోకుండా ప్రభుత్వమే తక్కువ ధరలకే అందజేస్తుంది. రైతుల పంట ఉత్పత్తులు సైతం కొనుగోలు చేస్తోంది.

– గీతమ్మ, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

బురద చల్లేందుకే అల్లరి

- డిక్లరేషన్ ఇవ్వలేదని అర్ధరాత్రి టీడీపీ నాయకుల యాగీ
- అరెస్టులకు దారితీసే వరకూ కావాలనే బైఠాయింపు
- పక్కా ప్రణాళికతో హల్‌చల్

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

'మేము ముందు బురద చల్లుతాం.. తర్వాత మీరు కడుక్కుంటూ ఉండండి..'–ఇదీ టీడీపీ నాయకుల వ్యవహారశైలి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ అనంతరం వారు మరింత దిగజారి వ్యవహరించారని జనంలో చర్చ సాగుతోంది. కౌంటింగ్ ముగిసి పది నిమిషాలు కూడా గడవక ముందే తమ అభ్యర్థి గెలిచినట్లు డిక్లరేషన్ పత్రం ఇవ్వలేదంటూ జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద నానా యాగీ చేశారు. ప్రభుత్వం ఏదో చేస్తోంది.. తమకేదో అయిపోతోందన్న రీతిలో వారు అల్లరి చేసిన తీరు దిగజారుడుతనానికి అద్దం పట్టిందని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రొసీజర్ తెలిసినా..

ఏ ఎన్నికల ఫలితాలైనా ఎలక్షన్ కమిషన్ అనుమతితోనే ధ్రువీకరిస్తారు. ఎన్నికల కమిషన్ ఓకే అంటేనే గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ అందజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టర్.. ఎన్నికల కమిషన్‌కు ఈ-మెయిల్ పంపించారు. అక్కడి నుంచి అనుమతి రాగానే డిక్లరేషన్ ఇస్తామని టీడీపీ నాయకులకు చెప్పారు. అయినప్పటికీ వారు ప్రభుత్వం, అధికార పార్టీపై బురదజల్లే ఉద్దేశంతో శనివారం అర్ధరాత్రి ధర్నాకు దిగారు. హంగామా చేస్తూ అరెస్టులకు దారితీసే పరిస్థితులు సృష్టించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మరుసటి రోజే డిక్లరేషన్..

టీచర్స్ ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి విజయం సాధించారు. ఈ ఫలితాలు ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి వచ్చాయి. ఈసీ అనుమతికి పంపించామని, మరుసటి రోజు డిక్లరేషన్ ఇస్తామని ఆర్‌ఓ చెప్పడంతో ఆయన కిమ్మనకుండా వెళ్లిపోయారు. టీడీపీ నాయకులకూ ఇదే విషయాన్ని చెప్పినా వినకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద అనవసరంగా రచ్చ చేశారు.

చంద్రబాబు ట్వీట్‌పైనా విమర్శలు..

పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు డిక్లరేషన్ విషయమై ప్రజలను తప్పుదోవ పట్టించేరీతిలో ముఖ్యమంత్రిని దూషిస్తూ ట్వీట్ చేయడంపైనా విమర్శలొచ్చాయి. దీన్నిబట్టే ఎంతగా దిగజారి ప్రవర్తించి ఉంటారో అంచనా వేయొచ్చని ఒక పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో పచ్చ మీడియా సైతం టీడీపీ నాయకులకు వంత పాడింది. కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత వంటి వారు కౌంటింగ్ కేంద్రం వద్దే బైఠాయించడం, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాలవ అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు. డిక్లరేషన్ అనేది ఎన్నికల కమిషన్ అనుమతితోనే అధికారులు ఇస్తారన్న కనీస ఇంగిత జ్ఞానం టీడీపీ నాయకులకు లేకపోయిందని ఓ సీనియర్ రాజకీయ నేత విమర్శించారు.

ద్విచక్ర వాహనం మరమ్మతుపై ఉచిత శిక్షణ

అనంతపురం: ఎస్కేయూ సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 23వ తేదీ నుంచి టూవీలర్, మోటార్ రీవైండింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ ఆర్.లోక్‌నాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసున్న నిరుద్యోగ యువకులు అర్హులు. ఉచిత శిక్షణతో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, రేషన్‌కార్డు నకళ్లతో కూడిన దరఖాస్తును రూడ్‌సెట్ సంస్థలో అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలి.మరింత సమాచారానికి 08554-255925, 9492583484, 9618876060 నంబర్లలో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా 'శెట్టిపి'



ధర్మవరం అర్బన్: జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. పెనుకొండలోని రవీంద్రభారతి స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ ప్రథమ సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. గతంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా ఆయన పనిచేశారు. శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికపై ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, హరికృష్ణ, బిల్లే రామంజినేయులు, రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, మల్లేష్, వినయ్‌కుమార్, ఆదిరెడ్డి, అమర్‌నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, అమరనాథరెడ్డి, వేణుగోపాల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

108లో ప్రసవం



నవజాత శిశువును చూపుతున్న 108 సిబ్బంది

నల్లమాడ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవమైంది. వివరాలు.. నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన గర్భిణి మౌనికకు శనివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గర్భిణిని తీసుకుని కదిరి ఏరియా ఆస్పత్రికి ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఆమెకు పైలెట్ నరసింహులు సాయంతో ఈఎంటీ రియాజ్ కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం ఆస్పత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కదిరి ఏరియా ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. 108 సిబ్బందికి మౌనిక కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రూపురూఖలు మారనున్న 'లేపాక్షి'



అందంగా రూపుదిద్దుకున్న ఆలయ గోపురం



వీరభద్రస్వామి తైలవర్ణ చిత్రాన్ని శుభ్రం చేసిన దృశ్యం



ఆలయ గోపురానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

లేపాక్షి: పురావస్తు శాఖ తాజాగా చేపట్టిన చర్యలతో లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం రూపురేఖలు మారనున్నాయి. దాదాపు ఐదు వందల సంవత్సరాల క్రితం విజయనగర చివరి రాజుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయంలో ఎన్నో అరుదైన శిల్పాలు, తైల వర్ణ చిత్రాలు ఉన్నాయి. విజయగనగర రాజుల శిల్ప కళావైభవానికి తార్కాణంగా నిలిచిన ఈ ఆలయ శిఖరాలపై నాడు గారతో పలురకాల బొమ్మలను అందంగా తీర్చిదిద్దారు. అనంతర కాలంలో నిరాదరణకు గురికావడంతో కొన్ని శిల్పాలను ముష్కరులు ధ్వంసం చేశారు. వర్షాలకు పైకప్పు కారడంతో తైల వర్ణ చిత్రాలు దెబ్బతిన్నాయి. పురావస్తు శాఖ ఆధీనంలోకి ఈ ఆలయం చేరిన తర్వాత శిల్పాలను, తైలవర్ణ చిత్రాలను యథావిధిగా ఉంచేందుకు పలు చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న దేవతామూర్తుల బొమ్మలను పునరుద్ధరించేందుకు తాజాగా చర్యలు తీసుకున్నారు. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం తీసిన ఫొటోలను ఆధారంగా చేసుకుని వీటిని పునరుద్ధరించనున్నారు. ఆలయానికి ప్రధానంగా ఐదు శిఖరాలు ఉండగా ఇందులో నాలుగు శిఖరాలపై శిథిలమైన బొమ్మల పునర్నిర్మాణం పూర్తయింది. ఈ శిఖారాలకు రంగులు వేస్తే మరింత అందంగా కనిపించే అవకాశం లేకపోలేదు.

హైకోర్టు జడ్జీల పర్యటన విజయవంతం చేద్దాం

- న్యాయవాదుల సమావేశంలో జిల్లా జడ్జి జి.శ్రీనివాస్
- ఎస్పీ ఫక్కీరప్పతో కలసి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి
- మోడల్‌క్యాంప్ నిర్వహణలో భాగంగా లబ్ధిదారులతో సమావేశం



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

రాయదుర్గం: జిల్లా కేంద్రంలో నిర్వహించే మోడల్ క్యాంప్‌ను హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్ ఉత్తర్వుల మేరకు రాయదుర్గానికి మార్చాల్సి వచ్చిందని, ఈ క్రమంలో హైకోర్టు న్యాయమూర్తుల పర్యటనను విజయవంతం చేద్దామంటూ న్యాయవాదులకు జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి దీనబాబు, రాయదుర్గం, కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జిలు ఎన్.లావణ్య, బి.సుభాన్, ఎస్పీ ఫక్కీరప్ప, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలసి ఆదివారం ఆయన రాయదుర్గంలో పర్యటించారు. ముందుగా దశభుజ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ఈ నెల 25న ఐదుగురు సభ్యులుగా ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల బృందం రాయదుర్గంలో పర్యటించనుందన్నారు. వీరిలో న్యాయమూర్తి డి.రమేష్ రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు. బార్ అసోషియేషన్ సభ్యులు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేయబోయే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం మద్దానేశ్వర కల్యాణమంటపంలో మోడల్ క్యాంప్ లబ్దిదారులతో సమావేశం నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. బసివినీలు, మహిళలు, బాలల హక్కులు, మహిళా సాధికారతపై సమావేశం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 600 నుంచి 700 మంది లబ్ధిదారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

త్వరలో పోస్టుల భర్తీ

రాష్ట్ర వ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం చర్యలు చేపట్టిందని జిల్లా జడ్జి శ్రీనివాస్ తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లోనే జిల్లాకు సంబంధించిన 267 పోస్టులు భర్తీ కానున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది నియామకం పూర్తయితే కేసుల విచారణ వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టుల్లో ఏడు రకాల ఫర్నీచర్ ఏర్పాటుకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాని, త్వరలో ఈ ప్రక్రియ కూడా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ యుంగధర్, తహసీల్దార్ మారుతి, ఎస్‌ఐలు సుమన్, దుగ్గిరెడి, రాయదుర్గం, కళ్యాణదుర్గం కోర్టు సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభలో గ్రేట్

- జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు సాధించిన మహమ్మద్ ముజామ్మిల్
- 80వ ర్యాంకు దక్కించుకున్న దాసరి నిర్ణీత

అనంతపురం: ఇంజినీరింగ్, సైన్స్ కోర్సుల్లో ప్రతిభను గుర్తించేందుకు నిర్వహిస్తున్న గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) పరీక్షల్లో అనంతపురం జేఎన్‌టీయూ విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 16న గేట్ ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ స్థాయిలో లక్షలాది మంది విద్యార్థులు రాసే ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శించి టాప్-100లో జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులు నిలిచారు. గేట్‌లో ప్రతిభ చాటుకుంటే పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో కొలువులు దక్కడమే కాక, సీఎస్ఐఆర్ స్పాన్సర్డ్ ప్రాజెక్ట్‌ల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అందజేస్తారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీల్లో కొలువులు దక్కాలంటే గేట్‌లో అర్హత తప్పనిసరి. ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు 23 ఐఐటీ కళాశాలల్లో, 31 ఎన్ఐటీ కళాశాలల్లో, ఐఐఎస్‌సీ బెంగళూరు, బిట్స్ పిలానీలో ఎంటెక్ అడ్మిషన్లు దక్కుతాయి. విదేశీ వర్సిటీల్లోనూ అడ్మిషన్లకు గేట్ ఉత్తీర్ణత అనివార్యం.బార్క్ (బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్)లోనూ పరిశోధనకు అవకాశముంటుంది. జేఎన్‌టీయూ (ఏ)కి చెందిన వడ్ల శివకృష్ణ ఆచారి జాతీయ స్థాయిలో 1,112వ ర్యాంకు, జి.సందీప్‌కుమార్ 1,169, ఎం.చిన్న ఎల్లారెడ్డి 2,378, ధరణి సింగమ్ శెట్టి 3,066, శ్రీవైష్ణవి 3,066, షేక్ వసీం 3,300 ర్యాంకులు దక్కించుకున్నారు.

75వ ర్యాంక్



జేఎన్‌టీయూ(ఏ)లో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన మహమ్మద్ ముజమ్మిల్ గేట్ జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు దక్కించుకున్నారు. మొత్తం 1000 మార్కులకు గాను 827 మార్కులు సాధించారు. 2018–2022లో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ఐఐటీ ముంబయిలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేస్తున్నారు. నాన్న జి.బాబా ఫకృద్దీన్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఇండియా కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, అమ్మ తహసీన్ ఏఈఈ (ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముజమ్మిల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. తరచూ సిలబస్‌ను రివిజన్ చేయడం, మాక్‌టెస్టులు ప్రాక్టీస్ చేయడంతో పోటీ పరీక్ష సులువైందన్నారు. ఐఐటీ ముంబయి ప్రొఫెసర్ సందీప్‌కుమార్ సాహా, అన్ ఎకాడమీ ఎడ్యుకేటర్ స్వప్నకుమార్ మొండాల్ సలహాలు, సూచనలు మంచి మార్కుల సాధనకు దోహదపడినట్లు తెలిపారు. ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) సాధించడమే తన లక్ష్యం అన్నారు.

80వ ర్యాంక్



ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజశేఖర్, గృహిణి విజయలక్ష్మి దంపతుల కుమార్తె నిర్ణీత 2022లో జేఎన్‌టీయూ(ఏ)లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇటీవల గేట్ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. నవరత్న కంపెనీల్లో ఉద్యోగంలో చేరడమే లక్ష్యంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

'పురం'లో వ్యాపారి కిడ్నాప్ కలకలం

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

హిందూపురం: డబ్బు కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఉదంతం హిందూపురంలో కలకలం రేపింది. కాగా, పోలీసులు సకాలంలో స్పందించి కిడ్నాపర్లలో ఒకరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. హిందూపురంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన శివలింగప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కర్ణాటక ప్రాంతంలో భూమి కొనుగోలుకు సంబంధించి శివలింగను వెంకటేష్‌బాబు అలియాస్ బాబురెడ్డి సంప్రదించాడు. ఈ క్రమంలో భూమి చూపించాలంటూ గత శుక్రవారం శివలింగను తన ముగ్గురు అనుచరులతో కలసి బాబురెడ్డి పిలుచుకెళ్లాడు. అనంతరం కర్ణాటకలోని ఓ గెస్ట్ హౌస్‌లో బంధించి, శివలింగ భార్య ప్రమీలమ్మకు ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. దీంతో కంగారు పడిన ఆమె వెంటనే హిందూపురం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై స్పందించిన డీఎస్పీ యశ్వంత్ వెంటనే సీఐ ఈరన్న, సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఓ వైపు పోలీసుల గాలింపు కొనసాగుతుండగానే.. ఆదివారం ఉదయం కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్న శివలింగప్ప నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన వృత్తాంతాన్ని వివరించాడు. వెంటనే పోలీసులు లేపాక్షి రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్దకు చేరుకుని బాబురెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, నకిలీ పిస్తోల్, ప్రాంసరీ నోటు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా విజేత 'అనంత'



విజేత ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు

ఉరవకొండ: కర్నూలు జిల్లా నందికొట్కూరు వేదికగా జరిగిన 33వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం బాలికల జట్టు విజేతగా నిలిచింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో శ్రీకాకుళంపై, సెమీఫైనల్స్‌లో ప్రకాశం జిల్లాపై వరుస విజయాలు నమోదు చేసిన అనంతపురం బాలికల జట్టు ఫైనల్‌లో కర్నూలు జిల్లా జట్టుపై తలపడింది. మొదటి సెట్‌లో కాస్త తడబడి 19–21 పాయింట్లు సాధించగా.. రెండో సెట్‌లో 21–15 పాయిట్లు, మూడో సెట్‌లో 21–17 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేతలను అభినందిస్తూ ట్రోఫీని కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, జూడో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో తొలిసారి జిల్లా జట్టును విజేతగా నిలిపిన క్రీడాకారులను ఆ క్రీడా విభాగం జిల్లా చైర్మన్ సప్తగిరిమల్లి, అధ్యక్షుడు షాహీన్, కోచ్‌లు నాగేంద్ర, వన్నూర్‌స్వామి, ఎర్రిస్వామి, పీడీ మారుతీప్రసాద్ అభినందించారు.

డ్యాన్స్ పోటీల్లో 'ఎస్కేయూ'కు ప్రథమ స్థానం



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న ఎస్కేయూ విద్యార్థులు

కళ్యాణదుర్గం: బెంగళూరులో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరంలో జరిగిన డ్యాన్స్ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఎస్కేయూ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఆ బృందానికి ఇన్‌చార్జ్‌గా వెళ్లిన కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఎల్.కాంతారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 12 విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థుల బృందాలు ఈ పోటీల్లో పాల్గొనగా.. ఎస్కేయూ విద్యార్థులు అన్నింటా ప్రతిభ చాటుకుని ప్రథమస్థానంలో నిలిచారు. ఇందులో పెనుకొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన సుష్మిత, హిందూపురం బాలయేసు కళాశాలకు చెందిన భార్గవి, సప్తగిరి కళాశాలకు చెందిన నరేష్, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ విద్యార్థి సాయికుమార్, ఎస్కేయూ విద్యార్థి అఫ్రోజ్ ఉన్నారు.

కస్టడీకి 'హవాలా' దోపిడీ ముఠా

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రిమాండ్‌లో ఉన్న హవాలా సొమ్ము దోపిడీ ముఠాకు చెందిన నలుగురు సభ్యులను అనంతపురం పోలీసులు విచారణ నిమిత్తం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 44వ జాతీయ రహదారి మీదుగా తరలుతున్న 'హవాలా' సొమ్ము రాప్తాడు సమీపంలోని హంపాపురం వద్ద దారి దోపిడీకి గురైంది. 'హవాలా' దోపిడీల్లో ఆరితేరిన కేరళ శ్రీధరన్ నేతృత్వంలోని గ్యాంగ్‌ల పనే ఇది అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శ్రీధరన్ నేతృత్వంలోని ఒక ముఠా సభ్యులైన కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లా ఆలువ వెస్ట్ గ్రామానికి చెందిన కొలపురం బిల్ అబు నిషాద్, కొట్టాయం జిల్లా చెంగానచేపూర్‌కు చెందిన జాక్సన్ ఫిలిప్, అలప్పుజ జిల్లా వేలంకులంగరకు చెందిన కన్నన్ రియాగు, కాలికట్ జిల్లా వడకర గ్రామానికి చెందిన ఓతవాత్ షమీంలను మార్చి పదో తేదీన అరెస్టు చేశారు. అయితే కీలక నిందితుడు శ్రీధరన్‌తో పాటు మరికొంతమంది సభ్యులు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నారు. ఈ ముఠా ఆట కట్టించాలని ఎస్పీ ఫక్కీరప్ప రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా కేరళ ముఠాను పట్టుకునేందుకు ఇంతకుమునుపు వెళ్లిన బృందాలను తిరిగి రంగంలోకి దింపాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఎస్పీ సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ముఠాల కదలికను గుర్తించాలని ఆదేశించారు. ఏ చిన్న ఆధారం లభించినా నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. హవాలా డబ్బును చాకచక్యంగా దోచుకుపోతున్న ముఠా వివరాలను ఇప్పటి దాకా పట్టుబడిన నలుగురు నిందితుల ద్వారా రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఉగ్రవాద సంస్థలతో సంబంధాల కోణంలో...

రాప్తాడు సమీపంలో జరిగిన దారి దోపిడీ ముఠా కోసం గాలిస్తున్న అనంత పోలీసులకు రూ.1.89 కోట్ల హవాలా డబ్బు తీసుకెళ్తున్న మరో ముఠా పట్టుబడింది. ఈ ముఠా నుంచి కూడా డబ్బు దోచుకెళ్లాలని వచ్చిన శ్రీధరన్ ముఠాను 'అనంత' పోలీసులు పట్టుకున్నారు. కాగా హవాలా డబ్బు తీసుకెళుతున్న ముఠాతో పాటు ఆ డబ్బును దోచుకెళ్లేందుకు వచ్చిన ముఠా రెండూ పట్టుబడటంతో పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. కాగా రూ.1.89 కోట్ల హవాలా డబ్బు తీసుకెళ్తున్న వారు తమిళనాడు, కోయంబత్తూరుకు చెందిన వారు కావడంతో సీఐఎస్ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ సెల్) అధికారుల బృందం అనంతపురం చేరుకుంది. రెండు నెలల క్రితం కోయంబత్తూరులో పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో హవాలా ముఠాలకు ఏమైనా హస్తం ఉందా? కేరళ శ్రీధరన్ ఎవరు? హవాలా డబ్బు సమాచారాన్ని ఎలా సేకరిస్తున్నారు? ఈ సొమ్ము ఎక్కడికి పంపుతున్నారు? ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

చితి మంటలు చుట్టుముట్టి వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న తిప్పేస్వామి నాయక్

ఆత్మకూరు: దహన సంస్కారాల్లో పాల్గొన్న ఓ వ్యక్తిని చితి మంటలు చుట్టుముట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బళ్లారి జిల్లా, కూడ్లిగి తాలూకా, చిరుమనెహళ్లికి చెందిన శశికళ (24)కు ఆత్మకూరు మండలం, పంపనూరు తండాకు చెందిన రమేష్ నాయక్‌తో ఈ నెల 12న వివాహమైంది. ఐదు రోజుల తర్వాత ఈ నెల 17న ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం పంపనూరు తండాలో ఆమె అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం మండలం వీరాపురం గ్రామానికి చెందిన సమీప బంధువు తిప్పేస్వామినాయక్ వచ్చాడు. మృతదేహాన్ని చితిపై పెట్టి నిప్పంటించిన సమయంలో తిప్పేస్వామి నాయక్ పెట్రోల్ చల్లుతూ వచ్చాడు. ఆ సమయంలో మంటలు ఒక్కసారిగా తిప్పేస్వామి నాయక్‌ను చుట్టుముట్టాయి. ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మంటలు ఆర్పే క్రమంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిప్పేస్వామినాయక్‌ను ఆటోలో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు క్షతగాత్రుడు స్పందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి



మృతురాలు పూజిత

బత్తలపల్లి: పాము కాటుకు గురై ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు... బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన గడారి పెద్దన్న మనమరాలు బాలుగుండ్ల పూజిత (12).. నార్సింపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి వర్షం కురుస్తుండడంతో బాలిక నరదాగా కేరింతలు కొడుతుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న శివయ్య వెంటనే స్థానిక నాటు వైద్యుడికి చూపించాడు. అనంతరం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున బాలిక మృతి చెందింది.

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. ఈ నెల 17న ఆత్మకూరు మండలం సింగన్నగుట్ట వద్ద చేపట్టిన తనిఖీల్లో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని ముత్యాలమ్మ కాలనీ నివాసి ఎరికల రత్నమ్మతో పాటు వాహన యజమాని ప్రకాశం జిల్లాకు చెందిన తమ్మిశెట్టి వెంకన్న, డ్రైవర్‌ని అరెస్ట్ చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు.